క్లుప్తంగా

పూర్ణ కుంభ కలశాల ఊరేగింపు



పూర్ణ కుంభ కలశాలతో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

పావగడ: తాలూకాలోని వైఎస్ హొసకోట గ్రామంలో ఈ నెల 27న శనివారం నిర్వహించనున్న మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని పురస్కరించుకుని వాల్మీకి విగ్రహానికి జలాభిషేక వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వందలాది మంది మహిళలు పూర్ణ కుంభ కలశాలను మోసుకుని ఊరేగింపుగా సాగారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య వాల్మీకి ప్రతిమకు జలాభిషేకం నిర్వహించారు.

మట్టి పరీక్షలు తప్పక చేయించాలి

గుడిబండ: మండల పరిధిలోని తిమ్మళాపురంలో శుక్రవారం నా పట్టు - నా అభిమానం కార్యక్రమంలో భాగంగా పట్టు రైతులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఆ శాఖాధికారులు నిర్వహించారు. సెరికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ హనుమంతరాయప్ప మాట్లాడుతూ మల్బరీసాగు చేసే ప్రారంభం ముందు మట్టి నమూనా పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు.

ఓటర్ల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయండి

రొళ్ల: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 2002 నమోదైన ఓటర్లను, ప్రస్తుతం 2025 నాటికి ఓటరు జాబితాలో 35 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు గల ఓటర్ల సరి చూసి వారి వివరాలను బూత్ లెవెల్ అధికారులు మ్యాపింగ్ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తహసీల్దార్ షేక్షావలి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బూత్ లెవెల్ అధికారులతో ఓటర్ల మ్యాపింగ్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు.

'జాబిలి' సేవా నిరతి ఆదర్శం



జాబిలి చాంద్‌బాషాను సన్మానిస్తున్న బ్రహ్మకుమారీలు, పట్టణ ముఖ్యులు

పెనుకొండ: ప్రముఖ కవిగా, ఉపాధ్యాయుడిగా, సామాజిక సేవా కర్తగా పట్టణానికి చెందిన జాబిలి చాంద్‌బాషా ఆదర్శ ప్రాయుడని స్థానిక బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం రాజయోగిని డాక్టర్ హేమలత పేర్కొన్నారు. పట్టణంలోని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన జాబిలి చాంద్‌బాషాను శుక్రవారం ఘనంగా సన్మానించారు. జాబిలి ఎన్నో ఏళ్లగా సామాజిక హితమైన కార్యక్రమాలు చేపడుతున్నారని కొనియాడారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. సమావేశంలో పలువురు వక్తలు జాబిలిని ప్రశంసించారు.

విద్యార్థినికి సన్మానం



మదీహను సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఫోరమ్ ఆఫ్ ఆర్టిస్ట్ అండ్ యాక్టివిటీ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో పురానికి చెందిన మదీహ వరల్డ్ రికార్డ్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. శుక్రవారం పట్టణంలోని సువర్ణ భారతి జూనియర్ కళాశాలలో కళాశాల పూర్వ విద్యార్థిని అయిన మదీహను వారు ఘనంగా సన్మానించారు. చిన్న వయసులోనే సేవాభావం కలిగి ఉండడాన్ని గుర్తించి నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఫోరమ్ ఆఫ్ ఆర్టిస్ట్ అండ్ యాక్టివిటీ సంస్థ అవార్డును ప్రదానం చేయడం హర్షణీయమన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో నవరాత్రి ఉత్సవాలు



వివిధ వేషధారణల్లో చిన్నారులు

గోరంట్ల: నాసిన్‌లో నూతనంగా ఏర్పాటైన కేంద్రీయ విద్యాలయంలో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం విద్యార్థులచే నిర్వహించిన లఘు నాటికలు అలరించాయి. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బట్టు కృష్ణారావు దసరా పండుగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.

ఘనంగా హిందీ ఉద్ఘాటన్ దివస్

కేంద్రీయ విద్యాలయంలో హిందీ దివస్‌ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బట్టు కృష్ణారావు మాట్లాడుతూ హిందీ రాజ్య భాష అని, ప్రతి ఒక్కరూ జాతీయ భాష అయిన హిందీ నేర్చుకోవాలని సూచించారు.

గ్రామాల్లో కంపు.. కంపు..

- చెత్తాచెదారం, మురుగు కాల్వలను శుభ్రం చేసేవారే కరువు
- దోమల వ్యాప్తితో ప్రబలుతున్న రోగాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామీణులు



గుట్టూరులో మడుగును తలపిస్తున్న వర్షపు నీరు

లేపాక్షి: మండలంలోని మైదుగోళం గ్రామంలో పారిశుధ్య లోపంతో గ్రామమంతా దుర్వాసన వెదజల్లుతోంది. డ్రైనేజీలు ఉన్నప్పటికీ వాటిని శుభ్రం చేయకపోవడం, అందులో చెత్తా చెదారం పడి కుళ్లిపోవడంతో కంపు కొడుతోంది. డ్రైనేజీలు లేని వీధుల్లోకి ఇళ్లలోని నీరు అంతా రోడ్లపైకి వస్తుండటంతో అపరిశుభ్రం తాండవిస్తోంది. పారిశుధ్య లోపంతో వ్యాధుల బారిన పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. మరో పక్కన నీటి పైపులు లీకేజీలు ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజలు వ్యాధుల బారిన పడకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆనందపాళ్యంలో ..

పరిగి: మండలంలోని మోదా పంచాయతీ ఆనందపాళ్యంలో పారిశుధ్యం లోపించింది. చినుకు పడితే చాలు రోడ్లన్నీ జలయంగా మారుతున్నాయి. మోదా నుంచి ఆనందపాళ్యంకు వెళ్లే రోడ్డంతా గుంతలమయంగా మారి అధ్వాన్న స్థితికి చేరుకున్న విషయం ఏడాదిగా సాక్షి పత్రికలో ప్రచురితమవుతూనే ఉంది. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి దేవుడెరుగు కనీసం ఓ కుగ్రామంలో మురుగు నీటిని సైతం పంచాయతీ అధికారులు శుభ్రం చేయకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరిశుభ్రతా కార్యక్రమాలను చేపట్టడంలో నిర్లక్ష్యమెందుకు వహిస్తున్నారో పాలకులు , అధికారులు తెలపాలని గ్రామస్తులు కోరుతున్నారు. చినుకు పడితే చాలు రోడ్డంతా చిత్తడిగా మారడంతో పాటు విష పురుగులు రోడ్డుపైకి వచ్చి చేరుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పెనుకొండ రూరల్: చిన్న పాటి వర్షాలకే రహదారులపై వర్షం నీరు మడుగును తలపిస్తోంది. అటుగా ప్రయాణించే వారికే కాకుండా చుట్టు పక్కల నివసించే వారికి కూడా ఇబ్బందిగా మారింది. మండలంలోని గుట్టూరులో ఘణగిరి ప్రైవేటు పాఠశాల ఎదురుగా ఉన్న రహదారి మడుగును తలపిస్తుంది. అటుగా ప్రయాణించే పాదాచారులు, ద్విచక్ర వాహన దారులు ఇబ్బంది పడుతున్నారు. అసలే వర్షాకాలంలో కావడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఇప్పటికైనా తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



ఆనందపాల్యంలో ప్రధాన రోడ్డుపై నిల్వ ఉన్న మురికి నీరు



మైదుగోళంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు



మైదుగోళంలో డ్రైనేజీ శుభ్రం చేయకపోవడంతో ఇలా..

సర్వ మతాలు సమానమే

- ఎస్పీ సతీష్‌కుమార్



సుగూరు ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

హిందూపురం: సర్వ మతాలు సమానమేనని, అందరూ కలసి మెలసి ఉండాలని ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. హిందూపురంలోని సుగూరు ఆంజనేయ స్వామి దేవస్థానంలో శుక్రవారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అలాగే సీఅండ్ఐజీ చర్చి ఫాదర్ ఆశీర్వాదాలు పొందారు. తర్వాత అల్‌హిలాల్ మసీదులో ముస్లింలతో కలసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా మత పెద్దలతో మాట్లాడారు. హిందూపురంలో అందరూ సోదర భావంతో ఉండటం చాలా సంతోషకరమన్నారు. చిన్న చిన్న వాటికి మనస్పర్థలకు తావులేకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. పోలీస్‌శాఖ ద్వారా ఎలాంటి సహకారం అవసరమైనా తాము అందించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా జైపాల్‌రెడ్డి



పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కమిటీ సభ్యులు

గోరంట్ల: మండల పంచాయితీ కార్యదర్శుల సంఘం మండల కమిటీని శుక్రవారం ఎంపిక చేశారు. మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా మందలపల్లి పంచాయతీ కార్యదర్శి జైపాల్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా రాజేంద్రను, గౌరవాధ్యక్షుడిగా మస్తాన్‌ను, కార్యదర్శులుగా శశికళ, కుమార్‌ను, కోశాధికారిగా సుబ్రహ్మణ్యం తదితరులను ఎంపిక చేశారు.

విద్యార్థినులకు శిక్షణ

హిందూపురం: ప్రభుత్వం కళాశాల విద్యార్థుల కోసం దసరా సెలవుల్లో ఈనెల 30వ తేదీ వరకూ ఇంటర్న్‌షిప్‌లో భాగంగా తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అమరా రమేష్‌బాబు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం మోడల్ స్కూల్లో ఒకేషనల్ ట్రైనర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థినులకు ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, చేతివృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చడంతో పాటు వారి మేధస్సుకు పదును పెడుతూ ఉన్నతంగా ఎదగడానికి ఎంతగానో సహకరిస్తుందన్నారు.

మడకశిరకు కృష్ణాజలాలు

మడకశిరరూరల్: హంద్రీనీవా కాలువ ద్వారా శుక్రవారం మడకశిర మండల పరిధిలోని కేతేపల్లి మీదగా సీ కొడిగేపల్లి వద్ద హంద్రీ నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు ప్రవహించాయి. కల్లుమర్రి వద్ద పంపు హౌస్ వద్దకు చేరగానే మోటార్లు ఎత్తి మణూరు చెరువులకు వదులుతారు. మణూరు చెరువు నిండిన తర్వాత హరే సముద్రం చెరువుకు ప్రవహిస్తాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 17 నెలల తర్వాత మడకశిర మండలానికి కృష్ణాజలాలు చేరాయి.

అన్నను విమర్శిస్తుంటే పవన్ నిద్రపోతున్నారా?

- ఏరు దాటారు కాబట్టే బాలకృష్ణకు చిరంజీవి బోడిమల్లన్న అయ్యారు
- వైఎస్సార్‌సీపీ నేతలు వేణురెడ్డి, మధుమతిరెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి, చిత్రంలో చౌళూరు మధుమతిరెడ్డి తదితరులు

చిలమత్తూరు: ఏరు దాటారు కాబట్టే ఎమ్మెల్యే బాలకృష్ణకు చిరంజీవి బోడిమల్లన్న అయ్యారని వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి విమర్శించారు. హిందూపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వేణురెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మీడియా సమావేశాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మధుమతిరెడ్డి, వేణురెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా చిరంజీవిపై బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలకు యావత్తు సినీ పరిశ్రమ ఆవేదన వ్యక్తం చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. సొంత అన్న చిరంజీవిపై అనుచిత వ్యాఖ్యలు చేసినా ఆయన సోదరులు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్సీ నాగబాబు స్పందించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. అసెంబ్లీలో హిందూపురం సమస్యలపై మాట్లాడాల్సిన బాలకృష్ణ .. మనసులో పెట్టుకున్న కుతంత్రాన్ని బయట పెట్టాడని మండిపడ్డారు. ఇలాంటి వ్యక్తికా తాము ఓటు వేసింది అని పురం ప్రజలు ఛీత్కరించుకుంటున్నారన్నారు. అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రెస్‌గా పురాన్ని మార్చి ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏలు మామూళ్లు తీసుకుంటూ పబ్బం గడుపుకుంటున్నారని, రూ.93 కోట్లు మున్సిపాలిటీకి వచ్చాయని చెబుతున్నారని అయితే ఆ నిధులు ఎక్కడున్నాయంటే సమాధానం చెప్పలేకపోతున్నారన్నారు. రాష్ట్ర కురుబ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఎ శివ, మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై కనీసం అవగాహన లేని వ్యక్తి ప్రజాప్రతినిధిగా ఉండేందుకు అర్హుడు కాదని, ఆ లిస్ట్‌లో మూడు పర్యాయాలు ఎమ్మెల్యే అయిన బాలకృష్ణ మొదటి స్థానంలో ఉన్నారన్నారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆసిఫుల్లా మాట్లాడుతూ పురంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని, ఫుట్ పాత్ వ్యవస్థ లేదని, వీధి లైట్లు లేక అంధకారంతో మగ్గుతున్న వీధిలెన్నో ఉన్నాయన్నారు. సమస్యలపై మాట్లాడటం మాని సొంత ఎజెండాలో భాగంగా తిట్టడానికి అసెంబ్లీని వేదికగా మార్చుకున్నాడని మండిపడ్డారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ విభాగం కార్యదర్శి అమానుల్లా, మైనార్టీ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఫరూఖ్, రాష్ట్ర బూత్ కమిటీ సంయుక్త కార్యదర్శి వరుణ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు మింటు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సూర్య మోహన్, హిందూపురం, లేపాక్షి మండల కన్వీనర్లు రాము, సయ్యద్ నిస్సార్, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు మహేష్‌గౌడ్, జిల్లా కార్యదర్శి తిప్పేరుద్రయ్య, లేపాక్షి వైస్ ఎంపీపీ అంజన్‌రెడ్డి, కౌన్సిలర్లు, రోషన్ అలీ, రామచంద్ర, గుడ్డం దాదు, షాజియా తదితరులు పాల్గొన్నారు.

టీకాల పంపిణీపై ఏడీ ఆరా



గాలికుంటు వ్యాధిపై వివరాలు సేకరిస్తున్న ఏడీ కళావతి

పెనుకొండ: మండలంలో పశువులకు వేస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలకు సంబంధించి జిల్లా వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ విజయవాడకు చెందిన పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ కళావతి ఆరా తీశారు. శుక్రవారం పట్టణంలోని పశు సంవర్ధకశాఖ కార్యాలయంలో జేడీ గిరిజ, ఏడీ శ్రీరాములు నాయక్ ఇతర సిబ్బందితో సమావేశమయ్యారు. వ్యాక్సిన్ ఏ విధంగా వేస్తున్నారు, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం అనంతపురం సిబ్బంది ఏ విధంగా రక్త నమూనాలు సేకరిస్తున్నారు తదితర విషయాలపై అడిగి తెలుసుకున్నారు. ఉపసంచాలకులు లక్ష్మీకాంతమ్మ ఆధ్వర్యంలో గొర్రెలకు బ్రూసల్లోసిస్ వ్యాధి నిర్ధారణకు రక్త నమూనాలు సేకరించారు. సిబ్బంది ప్రసాద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అగళి: మండలంలోని పీ బ్యాడగేర పంచాయతీలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ప్రతి గ్రామంలోని పశువులకు టీకాలు వేయించుకోవాలని సూచించారు. వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వెటర్నరీ అసిస్టెంట్ శివకుమార్ తెలిపారు.

మృతురాలి కమ్మలు మాయం

చిలమత్తూరు: హిందూపురం ప్రభుత్వాస్పత్రిలో అమానవీయ ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకొంది. హిందూపురం పట్టణం కోట ఏరియాకు చెందిన లక్ష్మమ్మ (80) అనారోగ్యంతో మృతి చెందింది. స్వల్ప కాల వ్యవధిలో ఆమె చెవుల్లో కమ్మలు మాయం అయ్యాయి. మృతురాలి కుమార్తె శారదమ్మ మాట్లాడుతూ మరణించిన విషయం వైద్యులు ధ్రువీకరించగానే బంధువులకు సమాచారం ఇచ్చేందుకు బయటకు వెళ్లానని, పది నిమిషాలకే ఆమె చెవిలో కమ్మలు దొంగిలించారని ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బందిని ప్రశ్నిస్తే తమకేమీ తెలియదని, శవాన్ని వదిలేసి మీరు వెళ్లడం సరికాదని చెప్పారన్నారు. ప్రభుత్వాస్పత్రిలో ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం కలకలం రేపుతోంది. జిల్లా సర్వజనాస్పత్రిలో దొంగలు పడ్డారా? లేక సిబ్బంది చేతివాటమా? అన్న విషయం ఉన్నతాధికారులు తేల్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ

గుడిబండ: మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కదురప్ప కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప కదురప్పను శుక్రవారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట నాయకులు తిప్పేస్వామి, నటరాజు, మంజు, గోవిందప్ప తదితరులు ఉన్నారు.

ఆర్డీటీపై అసెంబ్లీలో తీర్మానం చేయండి



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

హిందూపురం టౌన్: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ అందించేలా అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదికను పంపాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉన్న 14 మంది ఎమ్మెల్యేలు ఆర్డీటీ కోసం సీఎం చంద్రబాబుతో చర్చించి అసెంబ్లీలో తీర్మానం జరిగేలా చూడాలన్నారు. ఆర్డీటీపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కక్ష సాధిస్తున్నాయని, ముఖ్యమంత్రితో ఆర్డీటీ విషయాలపై చర్చించకపోతే ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. రాజకీయ దళారులు, రాజకీయ దోపిడీదారులు రాష్ట్రంలో ప్రజల సొమ్ము కాజేసి విదేశాల్లో నల్లధనాన్ని భద్రపరుస్తుంటే అలాంటి రాజకీయ రాక్షసులపై చట్టపరమైన చర్యలు తీసుకోకుండా ఆర్డీటీపై కక్ష సాధిస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, జై భీమ్ పార్టీ నాయకులు నాగరాజు, మూర్తి, ఎమ్మార్పీఎస్ నాయకులు నాగరాజు, నాగార్జున, కదిరప్ప, రవి తదితరులు పాల్గొన్నారు.

పీపీపీ విధానంతో విద్యార్థులకు నష్టం



మెడికల్ కాలేజ్ పనులను పరిశీలిస్తున్న నాయకులు

పెనుకొండ: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీపీపీ విధానంతో మెడికల్ విద్య చదవాలన్న పేద, మధ్య తరగతి విద్యార్థులు కల ఛిద్రమైందని సోషియల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. శుక్రవారం ఆ పార్టీ నాయకులు పట్టణంలోని మెడికల్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడికల్ విద్య అనేది ప్రజల కనీస హక్కు అన్నారు. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడం అనేది ప్రజా శ్రేయస్సుకు విరుద్ధమని చెప్పారు. కోట్ల రూపాయల విలువజేసే భూములను కేవలం వంద రూపాయలకే లీజుకివ్వడం దారుణమన్నారు. నాయకులు మైలానా అంజాద్‌అలి, నూర్‌మహమ్మద్, దాదాపీర్, మొహమ్మద్‌ఉమర్, జిల్లా కమిటీ సభ్యులు అబ్దుల్ హసీబ్, అజహార్, మహమ్మద్‌వలి, షేక్ ఇమామ్, షాహిన్, సులేహ, సమీవుల్లా, సాయి పాల్గొన్నారు.

డెంగీ నివారణపై అవగాహన

అగళి: మండల పరిధిలోని కోమరేపల్లి గొల్లహట్టి గ్రామంలో శుక్రవారం డాక్టర్ శివనంద ఆధ్వర్యంలో డెంగీ, మలేరియా వ్యాధులపై అవగాహన కల్పించారు. అందులో భాగంగా వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు కలిసి గ్రామంలో ర్యాలీ చేపట్టారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను శివనంద తెలియజేశారు.

ఉచిత మెగా వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

హిందూపురం టౌన్: పట్టణంలో స్థానిక ఎంజీఎం ఉన్నత పాఠశాలలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఫైరోజా బేగం, మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునిసిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు, ఇంజనీరింగ్ కార్మికులకు, మునిసిపల్ అధికారులందరికీ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించి అవసరమైన మందులు అందించినట్లు తెలిపారు. మొత్తం 366 మందికి స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించారు. అనంతరం రక్తదానం చేయాలనుకున్న వారు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్లు సంధ్య రాణి, జక్కా నరేంద్ర, సుప్రవీణ్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మడకశిర : మహాలక్ష్మీదేవిగా వడిశలమ్మ



సోమందేపల్లి: మహాలక్ష్మి రూపంలో చౌడేశ్వరిదేవి



పావగడ: మహాలక్ష్మిగా నల్లరాళ్ల గంగమ్మ

కరుణించు మహాలక్ష్మీదేవి

సాక్షి బృందం: దసరా ఉత్సవాలు హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఆయా ఆలయాల్లో అమ్మవార్లను అర్చకులు వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



హిందూపురం: మహాలక్ష్మిగా బోయకొండ గంగమ్మదేవి



లేపాక్షి: మహాలక్ష్మిగా దుర్గాదేవి

కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

మడకశిర: మున్సిపల్ కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటునట్లు మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో స్వచ్ఛోత్సవ్ - స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్మికులకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ నరసింహరాజు, కమిషనర్ జగన్నాథ్ పరిశీలించారు. కార్మికుల కుటుంబ సభ్యులకు కూడా వైద్య శిబిరంలో వైద్య సేవలందించారు.

సంఘాలు బలోపేతం చేయండి

రొళ్ల: గ్రామాల్లో పొదుపు సంఘాలను బలోపేతం చేయడానికి వీఓ లీడర్లు కృషి చేయాలని ఇన్‌చార్జ్ ఏరియా కోఆర్డినేటర్ నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక వెలుగు కార్యాలయం ఆవరణలో వీఓ లీడర్లు, మహిళ సంఘాల సభ్యులు, సీసీలతో ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు.

పంటల పరిశీలన



పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

గుడిబండ: మండలంలోని మోర్‌బాగల్ గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలను ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు శుక్రవారం పరిశీలించారు. రైతులు సాగు చేసిన వేరుశనగ, మొక్కజొన్న, పత్తి, మిరప పంటలను చూసి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వీరనరేష్, ఏరువాక కేంద్రం పుట్టపర్తి శాస్త్రవేత్త డాక్టర్ రామసుబ్బయ్య, కదిరి కృషి విజ్ఞాన కేంద్రం కీటక శాస్త్రవేత్త రమేష్ నాయక్, జిల్లా ఏడీఏ శైలకుమారి, ఏఓ చైతన్య పాల్గొన్నారు.